
ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
ఆదివారం26 ఏప్రిల్ 2026

# నంద్యాల నడి బొడ్డున కోట్ల భూమి ఐఎంఏకు..

## ప్రెస్ క్లబ్ హామీలు గాలిలోనా..?

**-జిల్లాలో ముదురుతున్న జర్నలిస్టుల ఆగ్రహం.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 25:**
పట్టణంలో స్థలాల కేటాయింపుల వ్యవహారం రాజకీయంగా మళ్లీ వేడెక్కింది.నంద్యాల నడిబొడ్డున ఉన్న అత్యంత విలువైన 10 సెంట్ల స్థలాన్ని ఐఎంఏ (ఇండియన్ మెడికల్ అసోసియేషన్)కు కేటాయించేందుకు జరుగుతున్న ప్రయత్నాలు తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి.పద్మావతి నగర్ ప్రాంతంలో సెంటు స్థలం కోటి రూపాయలు పలుకుతుండగా,ఈ భూమి విలువ సుమారు రూ.10 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. పట్టణంలో సుమారు 500 మందికి పైగా వైద్యులు ప్రైవేట్ రంగంలో సేవలు అందిస్తున్నారు.వీరిలో కొందరు పెద్ద నర్సింగ్ హోంలు నిర్వహిస్తుండగా,మరికొందరు క్లినిక్ లు నడుపుతూ లక్షల నుంచి కోట్ల వరకు ఆదాయం పొందుతున్నారని స్థానిక వర్గాలు చెబుతున్నాయి.ఇలాంటి పరిస్థితుల్లో సమావేశాల కోసం భవనం నిర్మించుకునేందుకు ఇప్పటికే ఆర్థికంగా బలమైన వర్గానికి చెందిన ఐఎంఏకు ప్రభుత్వ భూమి కేటాయించడం ఎంతవరకు సమంజసం అన్న ప్రశ్నలు జిల్లాలో వినిపిస్తున్నాయి.ఈ నిర్ణయంపై జర్నలిస్టు సంఘాలు,ప్రజా సంఘాలు,వామ పక్ష పార్టీ నాయకులు తీవ్రంగా మండిపడుతున్నాయి.ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే మీడియా వర్గాలకు మాత్రం ఇప్పటికీ స్థలం కేటాయించకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది.నంద్యాలలో ప్రెస్ క్లబ్ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని జర్నలిస్టు సంఘాలు ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నప్పటికీ,ఇప్పటివరకు ఎటువంటి స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదు. జిల్లాలో ప్రెస్ క్లబ్ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని పాత్రికేయులు నిరంతరం ప్రయత్నిస్తున్నప్పటికీ,ఇప్పటి వరకు ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.జిల్లా కేంద్రంగా ఉన్న నంద్యాలలో పాత్రికేయుల కోసం ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేయకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శిస్తున్నారు.
కాంగ్రెస్,టీడీపీ,వైసీపీ--ఏ పార్టీ అధికారంలో ఉన్నా జర్నలిస్టుల విన్నపాలు మాత్రం ఫలితం చూడలేదన్న విమర్శలు జిల్లాలో వెల్లువెత్తుతున్నాయి.
గతంలో అనగా 2009 సం "లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి ఉదార స్వభావంతో కొంతమంది సీనియర్ పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు కేటాయించడం జరిగింది.ఆ నిర్ణయాన్ని జర్నలిస్టులు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారు.అయితే ప్రస్తుతం ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు పాత్రికేయులకు ట్రిబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చింది. అలాగే 2024 సాధారణ ఎన్నికల్లో నంద్యాల నియోజక వర్గ టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన ప్రస్తుత న్యాయ,మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డీ ఫరూక్ జర్నలిస్టులకు వ్యక్తిగతంగా ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని ప్రకటించిన విషయం గుర్తు చేస్తున్నారు.కానీ ఇప్పుడు మాత్రం డిడ్కో ఇళ్లను పాత్రికేయులకు కేటాయిస్తామని,అర్హులైన వారు అప్లై చేసుకోవాలని చెప్పడం పట్ల జర్నలిస్టు వర్గాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.ఎన్నికల ముందు ఒక మాట..ఇప్పుడు మరో మాట ఎందుకు..?" అని పాత్రికేయులు ప్రశ్నిస్తున్నారు.ప్రెస్ క్లబ్‌కు స్థలం కేటాయించకపోవడం,ఇళ్ల హామీలు కూడా అమలు కాకపోవడంతో ప్రభుత్వంపై నమ్మకం దెబ్బతింటోందని అంటున్నారు. ఇక తాజాగా ఐఎంఏకు 10 సెంట్ల స్థలం కేటాయింపుపై జర్నలిస్టు సంఘాలు కలిసికట్టుగా,యూనియన్లకు అతీతంగా పోరాటాలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం..పేదల పక్షాన పోరాడే మీడియాకు కనీస సదుపాయం కల్పించకుండా,ఇప్పటికే బలమైన వర్గాలకు కోట్ల విలువైన భూములు కేటాయించడం అన్యాయమని వారు ఆరోపిస్తున్నారు.
ఇదే సమయంలో,రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తుందన్న ఐఎంఏపై ఉన్న ఆరోపణలు కూడా ఈ వ్యవహారాన్ని మరింత వివాదాస్పదంగా మారుస్తున్నాయి.
ప్రభుత్వ భూములు నిజంగా పేదల సంక్షేమం కోసమా..? లేక ప్రభావశీల వర్గాల కోసమా..? అన్న ప్రశ్నలు నంద్యాల జిల్లాలో గట్టిగా వినిపిస్తున్నాయి.
కోట్ల విలువైన భూమి ఐఎంఏకు..కానీ ప్రజల స్వరం వినిపించే ప్రెస్ క్లబ్‌కు స్థలం ఎప్పుడూ..అనేది ఇప్పుడు నంద్యాల ప్రజలు,జర్నలిస్టు వర్గాలు,ప్రజా సంఘాలు మరియు వామ పక్ష పార్టీ నేతలు అడుగుతున్న ప్రధాన ప్రశ్న గా మారింది.

# లీజు డిపాజిట్ ఫిర్యాదులపై విచారణ.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 25:**
నంద్యాల మున్సిపాల్టీలో లీజు సెక్యూరిటీ డిపాజిట్ మొత్తాల వసూళ్లపై వచ్చిన ఫిర్యాదులు తీవ్రంగా మారడంతో ప్రభుత్వం విచారణకు ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ నిర్వహించేందుకు మంగళగిరి మున్సిపల్ కమిషనర్ షేక్ అలీమ్ బాషాను విచారణాధికారిగా నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.
గతంలో నంద్యాల మున్సిపాల్టీలో పనిచేసిన సీనియర్ అసిస్టెంట్ ఎస్. అరిషా, జూనియర్ అసిస్టెంట్ ఎన్. రాఘవేంద్రరావు, విశ్రాంత మున్సిపల్ ఇంజినీరు ఎ. సత్యనారాయణరావు, విశ్రాంత సహాయ మున్సిపల్ కమిషనర్ వి. మోదకొండ, విశ్రాంత రెవెన్యూ అధికారి గజ్జల శ్రీనివాసులు తదితరుల పాత్రపై విచారణ జరగనుంది.లీజు సెక్యూరిటీ డిపాజిట్ వసూళ్లలో జరిగిన అనుమానాస్పద లావాదేవీలు, నిబంధనల ఉల్లంఘనలు, ఆర్థిక అసంగతతలపై లోతైన దర్యాప్తు చేపట్టి నివేదిక సమర్పించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. విచారణలో నిజాలు బయటపడితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని అధికార వర్గాలు సూచిస్తున్నాయి.ఈ పరిణామం నంద్యాల మున్సిపాల్టీలో సంచలనంగా మారగా, విచారణ ఫలితాలపై ప్రజల్లో ఆసక్తి నెలకొంది.

# డీజిల్, పెట్రోల్ కొరత లేకుండా చూడాలి.

**-ఆర్డీవోకు వినతి పత్రం అందజేసిన అభిరుచి మధు.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 25:**
జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేకుండా చూడాలని కోరుతూ బీజేపీ జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు నేతృత్వంలోని ప్రతినిధి బృందం నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్‌ను కలిసి విన్నవించింది. ఈ మేరకు కార్యాలయంలో ఆయనకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా అభిరుచి మధు మాట్లాడుతూ.. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇంధన నిల్వలు నిండుకోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో డీజిల్ కొరత ఏర్పడితే రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అధికారులు తక్షణమే స్పందించి చమురు సంస్థలతో మాట్లాడి నిరంతరాయంగా సరఫరా జరిగేలా చూడాలని కోరారు.బీజేపీ నాయకుల విన్నపంపై ఆర్డీవో సానుకూలంగా స్పందిస్తూ ఎక్కడా కృత్రిమ కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కశెట్టి చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు పసుపుల రవీంద్ర కుమార్, బెక్కెం నాగేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చేతివృత్తులకు 'పీఎం విశ్వకర్మ'

## అభివృద్ధి పథకం ద్వారా భరోసా.!

**--జిల్లాలో 262 మందికి ప్రత్యేక శిక్షణ... ప్రగతి పథంలో నంద్యాల విశ్వకర్మలు.**

**--నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షుడు డాక్టర్ అభిరుచి మధు.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 25:**
ప్రాచీన కళలు, చేతివృత్తులకు పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 'పీఎం విశ్వకర్మ' పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు తెలిపారు. జిల్లాలో ఈ పథకం అమలు తీరును, కళాకారులకు అందుతున్న లబ్ధిని వివరించారు.సాంకేతిక శిక్షణతో నైపుణ్యాల మెరుగుదలమారుతున్న కాలానికి అనుగుణంగా సాంప్రదాయ కళాకారులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని మధు సూచించారు. జిల్లాలో శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని పేర్కొంటూ ప్రధానంగా రెండు విభాగాలపై దృష్టి సారించినట్లు తెలిపారు:
**బొమ్మల తయారీ:** జిల్లావ్యాప్తంగా 223 మంది బొమ్మల తయారీదారులకు అత్యాధునిక పద్ధతులపై శిక్షణ ఇచ్చి వారి నైపుణ్యాలను మెరుగుపరిచామన్నారు.
**శిల్పకళ:** ప్రభుత్వ ఐటీఐ ద్వారా 39 మంది శిల్పులకు నిపుణుల సమక్షంలో శిక్షణ ఇప్పించి, వారి పనితీరులో నాణ్యత పెరిగేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.
**ఆర్థిక స్వావలంబనే లక్ష్యం:**ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం కళాకారుల శ్రమను గుర్తించి



వారికి తగిన గౌరవం కల్పిస్తోందని అభిరుచి మధు కొనియాడారు."శిక్షణ పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం గుర్తింపు పత్రాలను అందజేస్తుంది. అంతేకాకుండా, వృత్తిపరమైన పనిముట్లు కొనుగోలు చేయడానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని కూడా అందిస్తోంది," అని ఆయన వివరించారు.




**అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపు**
"నంద్యాల జిల్లా ప్రగతి పథంలో విశ్వకర్మలు" అనే నినాదంతో తాము ముందుకు వెళ్తున్నామని, అర్హులైన ప్రతి చేతివృత్తిదారుడు ఈ పథకంలో చేరి ఆర్థికంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. కళాకారుల కష్టానికి తగిన గుర్తింపు లభించినప్పుడే సమాజంలో నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని అభిరుచి మధు స్పష్టం చేశారు.

# రహదారి ఆక్రమణలపై మంత్రి ఎన్ఎండి ఫరూక్ సీరియస్.

**..తక్షణమే తొలగించాలని కమిషనర్‌కు ఆదేశం.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 25:**



నంద్యాల పట్టణంలోని ప్రధాన కూడలి అయిన శ్రీనివాస్ సెంటర్ సమీపంలో ఉన్న ఎస్బిఐ మెయిన్ బ్రాంచ్ పక్కన ఉన్న సందు ఆక్రమణకు గురికావడంపై రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ తీవ్రంగా స్పందించారు. స్థానికంగా ఉన్న ఈ కీలకమైన సందును కొందరు వ్యక్తులు ఆక్రమించి, మూసివేయడం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించిన మంత్రి ఫరూక్ శనివారం స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించారు. సందు మూసివేత వల్ల రాకపోకలకు కలుగుతున్న అంతరాయాన్ని పరిశీలించిన ఆయన, ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న గారిని సంఘటన స్థలానికి పిలిపించి మాట్లాడి, సందును ఆక్రమణలను తక్షణమే తొలగించాలి. మూసివేసిన మార్గాన్ని వెంటనే తెరిపించి, సాధారణ ప్రజల ఉపయోగంలోకి తీసుకురావాలిని తెలిపారు. పట్టణంలోని ప్రధాన రహదారులు, సందులు ఆక్రమణలకు గురికాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజల సౌకర్యార్థం ఉన్న దారులను ఆక్రమించడం చట్టవిరుద్ధమని, మున్సిపల్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని మంత్రి ఫరూక్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

# సెన్సస్ అవగాహనకు నంద్యాలలో 5కే రన్.

**టీ-షర్ట్ ఆవిష్కరణతో ప్రారంభమైన సెన్సస్ ఔట్‌రీచ్ కార్యక్రమం.**
**టెక్కే మార్కెట్ యార్డ్ నుంచి గాంధీ చౌక్ వరకు 5కె రన్.**
**..యువత, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలి.**
**..జనాభా గణనపై చైతన్యం కోసం ప్రత్యేక కార్యక్రమం.**
**..ఆదివారం ఉదయం 7:30కు సెన్సస్ రన్ ప్రారంభం.**
**..జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 25:**
జనాభా గణనపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించే లక్ష్యంతో ఆదివారం ఉదయం 7:30 గంటలకు నంద్యాల పట్టణంలోని టెక్కే మార్కెట్ యార్డ్ నుండి గాంధీ చౌక్ వరకు 5 కే రన్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. శనివారం కలెక్టర్ ఛాంబర్ లో



సెన్సస్ ఔట్‌రీచ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించనున్న 5ఖ రన్ కార్యక్రమానికి సంబంధించిన టీ-షర్ట్‌లను కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సెన్సస్ ప్రక్రియ ప్రాముఖ్యతను ప్రజలకు చేరవేసేందుకు ఈ కార్యక్రమం ముఖ్య వేదికగా నిలుస్తుందని చెప్పారు. ఆదివారం ఉదయం 7:30 గంటలకు నంద్యాల పట్టణంలోని టెక్కే మార్కెట్ యార్డ్ నుండి గాంధీ చౌక్ వరకు 5 కే రన్ కార్యక్రమంలో యువత, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. అలాగే ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని శాఖల అధికారులు తమ బృందాలతో తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. ఇది ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమమని, ఎటువంటి మినహాయింపులు ఉండవని స్పష్టం చేశారు. ఈ టీ-షర్ట్ ఆవిష్కరణలో డిఆర్ఓ రామునాయక్, మునిసిపల్ కమీషనర్ శేషన్న, ఆర్డీఓ విశ్వనాథ్, కలెక్టరేట్ ఏఓ శుభాకర్ తదితరులు పాల్గొన్నారు.

